## వైద్య ఖర్చులకు అండగా నిలిచిన "జనం కోసం మనం" సంస్థ



**దశ, పినపాక:** పినపాక మండలం సీతంపేట గ్రామానికి చెందిన గుండారపు సమ్మక్క (52) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. తలలో రక్తం గడ్డ కట్టడంతో ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించగా, ప్రస్తుతం ఎంజీఎం వరంగల్ లో చికిత్స పొందుతున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన సమ్మక్కకు వైద్యం కోసం అవసరమైన ఖర్చులు భరించడం కష్టంగా మారింది. రోజువారీ కూలి పనిపై ఆధారపడే కుటుంబం కావడంతో చికిత్స ఖర్చులు భారంగా మారాయి. ఈ విషయం తెలుసుకున్న మణుగూరు పట్టణానికి చెందిన "జనం కోసం మనం" స్వచ్ఛంద సంస్థ స్పందించి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని సమ్మక్క కుటుంబ సభ్యులకు అందించింది.ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు వేముల భాస్కర్, బండారు సురేష్, ఎస్కే అజారుద్దీన్ పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న ఫీ రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి: ఏబీవీపీ




**దశ, ఓయూ:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ విద్యానగర్ జిల్లా హబ్సిగూడ శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు కార్తీక్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీ రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్‌లు విడుదల చేయడం లేదని అన్నారు. దాదాపు పది వేల కోట్ల రూపాయల ఫీ రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుండా పేద విద్యార్థులను చదువుకు దూరం చేసే ప్రయత్నం జరుగుతోందని వారు విమర్శించారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీ రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏబీవీపీ పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు యోగేష్, కమల్, సుజయ్, సన్నీ, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూరిబా బాలికల పాఠశాల పరిశీలన చేసిన తహసిల్దార్



**దశ, పినపాక :** పినపాక మండలం ఐలాపురం గ్రామంలో ఉన్న కస్తూరిబా బాలికల పాఠశాలను తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హాస్టల్ సౌకర్యాలు, విద్యార్థినుల వసతి, ఆహార నాణ్యత, పరిశుభ్రత తదితర అంశాలను సమీక్షించారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థినులకు మెరుగైన సదుపాయాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని అన్నారు.

## డా. తాళ్ళ అజయ్‌కు డా. బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు



**దశ ఓయూ:** ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నేత, సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు మరియు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తాళ్ళ అజయ్‌కు ప్రతిష్టాత్మకమైన డా.బి.ఆర్.అంబేద్కర్ నేషనల్ అవార్డు-2026 ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన బహుజన సాహిత్య అకాడమీ 9వ తెలంగాణ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఈ అవార్డును బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ) జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీ వర్గాల సాహిత్యాన్ని ప్రోత్సహించేందుకు బహుజన సాహిత్య అకాడమీ ప్రతి సంవత్సరం ప్రజా ఉద్యమకారులు, సంఘసేవకులు, రచయితలు, కవులు మరియు స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డులను అందజేస్తోందని తెలిపారు. అంబేద్కర్ భావజాలంతో విద్యార్థి నాయకుడిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీల చైతన్యం కోసం కృషి చేస్తున్న డా. తాళ్ళ అజయ్‌కు ఈ అవార్డు ప్రదానం చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు తాటికంటి ఐలయ్య, బాదె వెంకటేశం, బొమ్మకంటి రాజేందర్, అకెపోగు ప్రమోద్ మహరాజ్, ప్రవీణ్, మనోజ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# నాబిడ్డ మృతికి శ్రీ విజ్ఞాన్ స్కూలే కారణం

- స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యమే ప్రాణం తీసింది
- శ్రీ విజ్ఞాన్ స్కూల్‌లో ఆందోళనకు చేసిన మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు
- మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్



**దశ, మణుగూరు:** నాబిడ్డ మృతికి శ్రీ విజ్ఞాన్ స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని శనివారం మృతి చెందిన విద్యార్థి హర్షవర్ధన్ తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ఆదివారం ఉదయం మృతిచెందిన విద్యార్థి హర్షవర్ధన్ తల్లిదండ్రులు, బంధువులు, స్థానికులు, విద్యార్థి సంఘాల నాయకులు కలిసి శ్రీ విజ్ఞాన్ స్కూల్ ముందు ఆందోళన చేపట్టారు.
ఈ సందర్భంగా తన కుమారుడు హర్షవర్ధన్ మృతికి శ్రీ విజ్ఞాన్ స్కూల్ యాజమాన్యం పట్టింపులేకుండా ఉండటమే కారణమని మృతుడి తల్లి విలపిస్తున్నా తీరు పలువురిని కంటతడి పెట్టించింది. చదువు చెప్తారని స్కూల్ పంపితే తన కొడుకుని శవంగా ఇంటికి పంపారని బోరున విలపించారు. ఒంటిపూట బడులు సమయంలో అదనపు తరగతులు నిర్వహించడమే మృతికి కారణమన్నారు. స్కూల్‌లో కనీస జాగ్రత్తలు తీసుకుంటే తన బిడ్డ బతికేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు, స్థానికులు మాట్లాడుతూ స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యమే విద్యార్థి ప్రాణం తీసిందని అందుకు పాఠశాల యాజమాన్యం భాధ్యత వహించాలన్నారు. మృతుడి కుటుంబానికి స్కూల్ యాజమాన్యం తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్కూల్ యాజమాన్యం ఎంతసేపటికి స్పందించకపోవడంతో ఆందోళనకారులు స్కూల్ లోపలికి వెళ్లితీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

### మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

విద్యార్థి మృతికి కారణమైన శ్రీవిజ్ఞాన్ స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణం కాబట్టి యాజమాన్యం భాధ్యత వహించి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించకుండా పాఠశాల నడిపిన శ్రీ విజ్ఞాన్ స్కూల్ అనుమతుల రద్దు చేయాలన్నారు.

- మునిగెల శివప్రశాంత్,
జిల్లా కార్యదర్శి, పీడీఎస్‌యూ

## స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సేవలు అభినందనీయం



- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో ఫండ్ నుండి కొనుగోలు చేసిన ఇన్సెనిరేటర్ (ప్యాడ్ బర్నింగ్) మిషన్‌లు, శానిటరీ ప్యాడ్ వెండింగ్ మిషన్లను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణంగా వాడి పారేసిన శానిటరీ ప్యాడ్లలో ప్లాస్టిక్, రసాయనాలు ఉంటాయని ఇవి భూమిలో కరగడానికి చాలా సంవత్సరాలు పడుతుందని తెలిపారు. బర్నింగ్ మిషన్లు వీటిని తక్కువ సమయంలో బూడిదగా మారుస్తాయని, దీనివల్ల భూమి కలుషితం కాదని, వాడిన ప్యాడ్లను బయట పారేయడం వల్ల బ్యాక్టీరియా చేరి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. ఈ మిషన్లను ఉపయోగించడం ద్వారా దుర్వాసన రాకుండా ఉంటుందని, ఈగలు, దోమలు వంటి కీటకాలు చేరకుండా అరికట్టవచ్చని మురికి కాలువలలో ప్యాడ్ల వల్ల జామ్ కాకుండా, గోప్యత ఆత్మవిశ్వాసం తో పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో మహిళలు వాడిన ప్యాడ్లను పారేయడానికి ఇబ్బంది పడుతుంటారు. జిల్లాకు 40 ఇన్సెనిరేటర్ (ప్యాడ్ బర్నింగ్) మిషన్లు, 20 శానిటరీ ప్యాడ్ వెండింగ్ మిషన్లు వచ్చాయని వాటిని కళాశాలకు, పాఠశాలలకు అందించడం జరుగుతుందని, త్వరలో అన్ని కళాశాలకు పాఠశాలకు సరఫరా చేయడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జడ్పి సీఈవో శిరీష ఏసీడిపివో కిరణ్మయి, జిల్లా కో ఆర్డినేటర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.



## సీనియర్ సిటిజన్ సేవలు అభినందనీయం

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట పట్టణ సీనియర్ సిటిజన్ సేవలు అభినందనీయమని మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ లో సూర్యాపేట పట్టణ సీనియర్ సిటిజన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రం వద్ద బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చుటకు చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వయోవృద్ధులు సైతం సమాజసేవలో పాలు పంచుకోవడం గర్వకారణమన్నారు. పట్టణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మిడి లక్ష్మినారాయణ మాట్లాడుతూ ప్రతిరోజు దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేయనట్లు తెలిపారు. ఆసక్తి గలవారు సంప్రదించవచ్చు అన్నారు. మజ్జిగ దాతగా సహకరి0చిన బోనగిరి రామమూర్తి, భాగ్యలక్ష్మిల జ్ఞాపకార్థం కుమారులు విజయకుమార్, నాగలక్ష్మి లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బైరు శైలేందర్, మాజీ కౌన్సిలర్లు జ్యోతి కరుణాకర్, బైరబోయిన శ్రీనివాస్, నిమ్మల శ్రీనివాస్ సీనియర్ సిటిజన్ సభ్యులు చారి, నరేంద్రుని విద్యాసాగర్ రావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా పెద్దిరెడ్డి రాజా పుట్టినరోజు వేడుకలు

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా పుట్టినరోజు వేడుకలు సూర్యాపేటలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, మిత్రులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెద్దిరెడ్డి రాజా మరింత ఉన్నతమైన పదవులు పొందాలని, భగవంతుడు ఆయనకు అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు కల్పించాలని ఆకాంక్షించారు. అలాగే ఆయన సమాజ సేవలో మరింత ముందుకు సాగాలని కోరుతూ పలువురు నేతలు అభినందనలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, కౌన్సిలర్స్ డాక్టర్ ఊర రామ్మూర్తి, నాగుల వాసు, జ్యోతి కరుణాకర్, గండూరి రమేష్, సర్పంచ్ భూక్య రాజు నాయక్, నాయకులు నేరెళ్ల మధు, సుధా బ్యాంక్ ఎండి, పెద్దిరెడ్డి గణేష్, కక్కిరేణి చంద్రశేఖర్, నాయకులు బైరబోయిన శ్రీనివాస్, గోదల రంగారెడ్డి, నిమ్మల వెంకన్న, యామ ప్రభాకర్, రాచకొండ శ్రీనివాస్, తోట శ్యామ్, గుడిపూడి వెంకటేశ్వరరావు, కొండగడుపుల సూరయ్య, మాచర్ల కృష్ణ, పలువురు నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

### పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన ఆదర్శ నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో..

## 'ప్రజల సహకారంతో స్వచ్ఛ నల్లగొండ'




- మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర.

**దశ, నల్గొండ:** ప్రజల సహకారంతోనే స్వచ్ఛ నల్లగొండ హరిత నల్లగొండ సాధ్యమవుతుందని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు.నల్లగొండ నగరాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన ఆదర్శ నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సోమవారం ఉదయం 12, 27, 28వ డిబిజన్లలో పారిశుధ్య కార్యక్రమాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఇంటి పన్నుల వసూళ్ల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటి వారు తమ గృహ వ్యర్థాలను వీదుల్లో, ఖాళీ స్థలాల్లో లేదా డ్రైన్లలో వేయకుండా తప్పనిసరిగా మున్సిపల్ శానిటేషన్ వాహనాలకే అందించాలని విజ్ఞప్తి చేశారు. "ఇంటి చెత్తను శానిటేషన్ వాహనాలకే ఇవ్వండి - నల్లగొండను పరిశుభ్రంగా ఉంచండి" అని పౌరులకు పిలుపునిచ్చారు. అధికారులు, సిబ్బంది, ప్రజలు సమన్వయంతో పనిచేస్తేనే నల్లగొండను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దవచ్చన్నారు. డ్రైన్లలో పేరుకుపోయిన సిల్ట్, చెత్తను వెంటనే తొలగించి నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని, ప్రతిరోజూ స్వీపింగ్ కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, అలాగే కమర్షియల్ ఏరియాల్లో ప్రతిరోజూ విధిగా చెత్త సేకరణ జరగాలని సూచించారు. డోర్ టు డోర్ చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించి, ప్రతి ఇంటి నుండి తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు వేర్వేరుగా సేకరించాలన్నారు. గృహస్థులు తడిపొడి వ్యర్థాలను వేరు చేసి ఇవ్వడం ద్వారా వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెస్ చేసి జీరో ల్యాండ్ ఫిల్లింగ్ లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. శానిటరీ సూపర్‌వైజర్లు ప్రతిరోజూ ఫీల్డ్ మానిటరింగ్ నిర్వహించి పారిశుధ్య కార్యకలాపాలను పర్యవేక్షించాలన్నారు.ప్రజల నుండి వచ్చే పారిశుధ్య ఫిర్యాదులు, ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. దోమల నివారణ, ఫాగింగ్, యాంటీ లార్వా చర్యలు, సీజనల్ వ్యాధుల నివారణ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ గద్దం శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ నంద్యాల ప్రదీప్తి, ఆర్‌ఓ శివరాంరెడ్డి, శానిటరీ జవాన్ కె.పరశురామ్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# సమాజంలో సౌభ్రాతృత్వం పెంపొందించేందుకు కృషి చేయాలి

❖ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.

❖ ఘనంగా మహాత్మా శ్రీ బసవేశ్వర జయంతి వేడుకలు



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** బసవేశ్వరుడి ఆశయాలను అనుసరించి సమాజంలో సౌభ్రాతృత్వం పెంపొందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. సోమవారం, సద్దుల చెరువు (మినీ ట్యాంక్ బండ్) వద్ద వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మా శ్రీ బసవేశ్వర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్షాది లు బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహాత్మా బసవేశ్వరుడు 12వ శతాబ్దంలో సమాజంలో ఉన్న కుల వ్యవస్థ, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి సమానత్వం, న్యాయం, ధర్మం వంటి విలువలను ప్రచారం చేసిన మహనీయుడు అని కొనియాడారు. లింగ, బలిజ కమ్యూనిటీ కోసం అవసరమైన భూమిని కేటాయించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత మాట్లాడుతూ మనుషులంతా ఒక్కటేనని, కులాలు, ఉపకులాలు లేవన్న మహాత్మా బసవేశ్వరుని సందేశం ఆచరణీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ బసవేశ్వరుని ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. అనంతరం అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, కార్యదర్శులు, అధ్యక్షులు, తదితరులు ఆయన చిత్రపటానికి అంజలి ఘటించి నివాళులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి సభ్యులు సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి నరసింహ, తహసీల్దార్ కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, టీఎన్జీవోస్ జిల్లా సెక్రెటరీ దున్న శ్యామ్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలి, మున్సిపల్ కౌన్సిలర్లు, వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం అధ్యక్షుడు వల్లెం శేఖర్, వీరశైవ లింగాయత్ లింగ బలిజ కులస్తులు, బిసి వెల్ఫేర్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన అర్చనను పరామర్శించిన టిజిబికేఎస్ నాయకులు నాగేల్లి వెంకట్



**దశ, మణుగూరు:** మణుగూరు మండలంలో గల సింగరేణి ఉద్యోగి అర్చనకు సోమవారం కూనవరం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గాయలపాలైన అర్చనను స్థానికులు పీవీ కాలనీలో గల సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అర్చనను తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం మణుగూరు ఏరియా నాయకులు నాగేల్లి వెంకట్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీజీబీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

## మాణికేశ్వర్ నగర్ కమాన్ వద్ద ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు

❖ ప్రజలకు మజ్జిగ పంపిణీ చేసిన గండికోట విజయకుమార్



**దశ, ఓయూ:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదినం వేడుకలను మానికేశ్వర్ నగర్ కమాన్ వద్ద తెలుగు తమ్ముళ్లు ఘనంగా నిర్వహించారు. తార్నాక డివిజన్ టిడిపి అధ్యక్షుడు గండికోట విజయ్ కుమార్ ఆధ్వర్యంలో బర్త్డే కేక్ కట్ చేసి వేడుకలను సంబరంగా జరుపుకున్నారు. ప్రజలందరికీ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు తెలుగు ప్రజలందరికీ, టీడీపీ శ్రేణులకు ఒక పండుగ వాతావరణం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాణికేశ్వరీ నగర్, తార్నాక డివిజన్ చెందిన టిడిపి నాయకులు, GM.రమేష్ , ప్రసాద్ రావు, md నాసర్ ,విక్రమ్,రాజేష్, నవీన్,గిరిబాబు, బాలకృష్ణ, సహదేవ ,భరత్ , చెర్రీ ,బిట్టు, యాది, శ్రీకాంత్ , నితీష్, చైతు ,జాన్ శివ , రాజు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థినీలకు వ్యాక్సినేషన్ ప్రారంభించిన తహసిల్దార్



**దశ, మునగాల :** దేశవ్యాప్తంగా 14 సంవత్సరాల లోపు విద్యార్థినిలు, బాలికలకు క్యాన్సర్ నిరోధకానికి అందిస్తున్న ఉచిత హెచ్ పి వి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సోమవారం మండల కేంద్రంలోని స్థానిక మోడల్ స్కూల్ లో తహసిల్దార్ సరిత ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె విద్యార్థినీలను ఉద్దేశించి మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భయంకరమైన క్యాన్సర్ వ్యాధి నిరోధించడానికి 14 సంవత్సరాల లోపు విద్యార్థినీలు, బాలికలకు ఉచితంగా అందించే హెచ్ పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విద్యార్థినీలు మరియు బాలికలు సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ వేయించుకోవాలని ఆమె కోరారు. స్థానిక వైద్యాధికారి రవీందర్ మాట్లాడుతూ, ఉచిత వ్యాక్సినేషన్ విషయంలో అనవసరమైన అపోహలకు పోకుండా విద్యార్థినీలు, బాలికలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాక్సినేషన్ పైన అవగాహన కల్పించుకొని క్యాన్సర్ వ్యాధి నిరోధకానికి తప్పకుండా ప్రతి ఒక్కరు వ్యాక్సినేషన్ వేయించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బూర సైదయ్య గౌడ్ , పాఠశాల ఉపాధ్యాయులు మరియు ప్రాథమిక వైద్యశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఎంజీయూ హాస్టల్స్ భోజనంలో పురుగుల కలకలం

❖ ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన

**దశ, నల్గొండ :** నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ బాలుర హాస్టల్స్ భోజనంలో పురుగులు కనిపించడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం బాలుర హాస్టల్స్‌లోని మెస్‌లో మధ్యాహ్న భోజనంకై వెళ్లి విద్యార్థులకు వడ్డించిన అన్నంలో పురుగులు రావడంతో విద్యార్థులు ఇదేమి అన్నం, ఎలా తినాలి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించాలని కోరుతూ హాస్టల్ మెస్‌లకు తాళం వేశారు. దీంతో వర్సిటీ ఏబీవీపీ అధ్యక్షుడు హనుమాన్ తో పాటు విద్యార్థులు అధికారుల వైఖరీని నిరసిస్తూ హాస్టల్స్ మెస్ వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత లేకుండా ఉండటం, అందులో పురుగులు కనిపించడం యాజమన్యం వైఫల్యమేనని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత వీసీ, రిజిస్ట్రార్స్ ఉందని అయితే ఈ విషయం వారికి తెలిసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యహరించడం ఏమిటని ప్రశ్నించారు. ఇది విద్యార్థుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా ఉందని తెలిపారు. యూనివర్సిటీలో గతంలో సహితం ఇలాంటి సంఘటనలు జరిగిన సందర్భంలో వీసీ స్వయంగా మాట్లాడి ఇలాంటి సంఘటనలు తిరిగి రాకుండా చూస్తామని హామీ ఇచ్చారన్నారు. నాణ్యత లేని ఆహారం తినడంతో ఎంతో మంది విద్యార్థుల అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలోనాయకులు అజయ్,సంపత్,సతీష్,విజయ్, వెంకటేష్,సుధీర్,అరవింద్,పృధ్వీ,సాయి,గోపి,ప్రణయ్ పాల్గొన్నారు.

## నిరుపేద ఆర్యవైశ్యులకు నిత్యవసర సరుకులు, కూరగాయల పంపిణీ




**దశ, సూర్యాపేట ప్రతినిధి :** అక్షయ తృతీయ పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సోమవారం శ్రీ వాసవి సేవా సమితి సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అట్టడుగు వర్గాన ఉన్న ఆర్యవైశ్య నిరుపేదలకు సుమారు 5 వేల రూపాయలు విలువ గల నిత్యవసర సరుకులు, కూరగాయలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి సేవా సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి నాగరాజు, కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్ లు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో మొట్టమొదటిసారిగా శ్రీ వాసవి సేవా సమితి స్థాపించి నిరుపేద ఆర్యవైశ్యులకు ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 27 నుండి వేసవి సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు బ్రాహ్మణ కళ్యాణ మండపంలో ఉదయం ఏడు గంటల నుండి ఎనిమిది గంటల వరకు సూర్యాపేట ఉన్నత యోగ శిక్షణ కేంద్రం గురూజీ చాడపాపిరెడ్డి ఆధ్వర్యంలో 15 రోజులపాటు యోగా శిక్షణ తరగతులు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజ సేవే లక్ష్యంగా శ్రీ వాసవి సేవాసమితి పనిచేస్తుందని, భాగస్వామ్యం కావాలని అనుకునే ఆర్యవైశ్యులు శ్రీ వాసవి సేవా సమితి లో సభ్యులుగా చేరి సేవలు అందించవచ్చు అని తెలిపారు. వనపర్తికి చెందిన పూరి సురేష్ శెట్టి ఏర్పాటు చేసిన శ్రీ వాసవి సేవా సమితి గత తొమ్మిది సంవత్సరాలుగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో సేవలు అందిస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి సేవా సమితి ఉపాధ్యక్షులు మిరియాల సుధాకర్, కుంచ మర్రి రాజశేఖర్ సహాయ కార్యదర్శి బచ్చు శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు వందనపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సీబీఎస్ఈ టెన్త్‌లో 100 శాతం ఉత్తీర్ణత

❖ డీపీఎస్ పల్లవి విద్యార్థుల ఘన కీర్తి

❖ వందలాది టాపర్లతో నూతన రికార్డు

❖ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పురస్కారాలు




**దశ, హైదరాబాద్:** విద్యా ప్రమాణాలకు మార్గదర్శకంగా నిలుస్తున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్ ), పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మరోసారి అద్భుత ఫలితాలతో తమ ప్రతిభను చాటాయి. ఇటీవల విడుదలైన సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో ఈ విద్యాసంస్థలు 100 శాతం ఉత్తీర్ణత సాధించి అఖండ విజయాన్ని నమోదు చేశాయి. ఈ సందర్భంగా బాగ్ లింగంపల్లిలోని టీజీఎస్ఆర్టీసీ కళ్యాణ మండపం ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం కన్నుల పండువగా జరిగింది. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. 95శాతం పైగా మార్కులతో వందలాది విద్యార్థులు మెరిసి ప్రతిభ సాధించారు.

237 మంది విద్యార్థులు 95 శాతం పైగా మార్కులు సాధించారు. 716 మంది విద్యార్థులు 90శాతం పైగా సాధించారు. 1582 మంది విద్యార్థులు 80 శాతం పైగా, 98శాతం మంది విద్యార్థులు 60శాతం పైగా మార్కులు సాధించి సరికొత్త మైలురాయి నిలిపారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల సమర్థ బోధన, తల్లిదండ్రుల సహకారం కలిసి ఈ అద్భుత విజయాన్ని సాధించాయని యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ జె.డి. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా సమాజం పట్ల బాధ్యత గల పౌరులుగా ఎదగాలని సూచించారు. దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

## నవ్యాంధ్ర రూపశిల్పి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు

❖ ఘనంగా తారక సేవా సమాఖ్య ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ సేవా కార్యక్రమం



**దశ, ఓయూ:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, నవ్యాంధ్ర రూపశిల్పి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు తారక సేవా సమాఖ్య ఆధ్వర్యంలో తార్నాకలో ఘనంగా నిర్వహించారు. “ప్రజల కోసం - ప్రజల సేవలో” అనే నినాదంతో ఈ సందర్భంగా సమాఖ్య మజ్జిగ పంపిణీ సేవా కార్యక్రమాన్ని చేపట్టింది. మండే ఎండలను దృష్టిలో ఉంచుకుని వందలాది మంది బాటసారులకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జొన్నలగడ్డ శేషగిరి రావు ఆర్థిక సహకారం అందించి, సేవా దృక్పథంతో మజ్జిగ పంపిణీలో కీలక పాత్ర పోషించారు. అనంతరం అభిమానులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు, వక్తలు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, దేశాభివృద్ధిలో ఆయన పాత్ర విశిష్టమని కొనియాడారు. కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన జొన్నలగడ్డ శేషగిరి రావుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అడుసుమిల్లి చిట్టి వీరయ్య, నాగమల్లేశ్వరి మన్నె, నరేంద్ర బాబు కాట్రగడ్డ, జొన్నలగడ్డ శేషగిరి రావు, తోటకూర చంద్రమౌళి, కాంద్రు బుచ్చయ్య చౌదరి, పాటిబండ్ల నాగేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు కనకమెడల రాంబాబు, సీబీఎన్ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు తలారి శ్రీనివాసరావు, రావి జయదీర్‌తో పాటు స్థానిక ప్రముఖులు, స్వచ్ఛంద కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.